# అడుగుకో గుంత..


ఇంద్రనగర్ మార్కెట్ రోడ్డుపై గుంత


సాగర్ కాలనీ వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


శాస్త్రీనగర్ రోడ్డు దుస్థితి

- నిర్మల్‌లో అధ్వానంగా అంతర్గత రోడ్లు
- అవస్థలు పడుతున్న పట్టణవాసులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ఎన్టీఆర్ మార్గ్ రోడ్ నంబర్ వన్‌లో ప్రమాదకరంగా రోడ్డు


ప్రియదర్శిని నగర్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి వెనకాల రోడ్డు దుస్థితి

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడితే ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ఎప్పుడు గడుస్తుందా అని ఎదురుచూస్తున్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో 42 వార్డులు ఉండగా.. అన్నిచోట్ల ఇదే దుస్థితి నెలకొంది. దీనికి తోడు పైప్‌లైన్లు, కేబుల్ కోసం తవ్విన రోడ్లను సకాలంలో పునరుద్ధరించకపోవడంతో చాలా చోట్ల దారులు అస్తవ్యస్తంగా మారాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో రాత్రి ఎక్కడ గుంత ఉందో తెలియడం లేదు. దీంతో వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు.

**42 వార్డుల్లో అదే దుస్థితి..**

పట్టణంలో మొత్తం 42 వార్డులు ఉన్నాయి. దాదాపు అన్ని కాలనీల్లోనూ రోడ్లపై గుంతలు ఏర్పడటంతో పట్టణ వాసులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రియదర్శినినగర్, ఎన్టీఆర్ మార్గ్, బుధవార్‌పేట్, మంజులాపూర్, ఆదర్శనగర్, రవినగర్, దివ్యనగర్, శ్రీనగర్, బంగాల్‌పేట్, భాగ్యనగర్, ఇంద్రనగర్, శాస్త్రినగర్, సాగర్ కాలనీ, చింతకుంటవాడ, గాయత్రి టౌన్‌షిప్, శాంతినగర్‌తో పాటు పలు కాలనీల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక కొత్త కాలనీల్లో పరిస్థితి మరింత దారుణం. మొరం పోసిన రోడ్లతోపాటు ఆర్టీఓ కార్యాలయం నుంచి ఈద్గాం వరకు, చైన్‌గేట్ నుంచి పాతమార్కెట్, ఓల్డ్ బస్టాండ్ నుంచి గాంధీ చౌక్ వరకు కూడా రోడ్లు అధ్వానంగా మారాయి.

**వాహనదారులకు నరకమే..**

ఈ గుంతల రోడ్లపై వాహనాలు నడపాలంటే నరకం కన్పిస్తుందని.. చాలా మందికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్ల కారణంగా స్కూల్ బస్సులు గమ్యం చేరుకోవడం లేదు.

### ఇంకెప్పుడు రోడ్లు వేస్తారు..



నిర్మల్ జిల్లాకేంద్రంగా ఏర్పడి ఏళ్లవుతోంది. కానీ ఇప్పటికీ చాలా కాలనీల్లో రోడ్ల సమస్య ఉంది. బైక్‌పై వెళ్తుంటే బొక్కలు కదిలినట్లు అవుతున్నాయి. కాలనీలో అంతర్గత రోడ్లు మరి అధ్వానంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలి. – పూదరి శివ, నిర్మల్

**పట్టించుకోని అధికారులు**

నిర్మల్‌లో ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## జననేతకు ఘన నివాళి


నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కుభీర్‌లో..

**నిర్మల్‌చైన్‌గేట్:** ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా సేవలందించి రైతులకు ఉచిత కరెంట్‌బిల్లు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నిర్మల్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడప్పుచిన్ను, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

**కుభీర్:** మండలకేంద్రంలో నిర్వహించిన వేడుకలో కాంగ్రెస్ నాయకులు, ఆత్మ చైర్మన్ వివేక్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బషీర్, బాబు, అబ్దుల్ వాహెద్, రాందాస్, నరేందర్, జెడీరాం ఉన్నారు.

**లక్ష్మణచాంద:** మండలవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, రవి, రమేశ్, ప్రేమ్ ఉన్నారు.

**కడెం:** మండలంలోని లింగాపూర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, అభిమానులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరిశంకర్, మహమ్మద్ సలీం, ముస్కు రాజు, ఆకుల లచ్చన్న, అన్వర్, కోల శ్రీనివాస్, మల్లేశ్ తదితరులున్నారు.


లక్ష్మణచాందలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు


కడెం: లింగాపూర్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

## నేటి సమ్మె జయప్రదం చేయాలి

**నిర్మల్‌చైన్‌గేట్:** ఈనెల 9న దేశవ్యాప్తంగా చేపట్టే కార్మికుల సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల తరపున మద్దతు తెలుపుతున్నామని వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లాకేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాజ్యాంగ హక్కుల్ని కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాస్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వాగ్ మారే మహేందర్, కిరణ్, నరేశ్ పాల్గొన్నారు.

**ఖానాపూర్:** ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు పసుపుల వెంకన్న కోరారు. స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని కోరారు.

## క్లుప్తంగా

### నైతిక విలువలు బోధించాలి


పాదపూజ చేస్తున్న విద్యార్థులు

**సోన్:** విద్యార్థులకు నైతిక విలువలు బోధించాలని మండలంలోని కద్తాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజులదేవి రమేశ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కద్తాల్ ప్రాథమిక పాఠశాలలో మాత వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగమ్మ, రాధ, మౌనిక, జ్యోతి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతివనం హద్దులు చూపాలి

**లక్ష్మణచాంద:** మండలంలోని బోరిగాంతండా పల్లె ప్రకృతివనం హద్దులు చూపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ప్రకృతివనం కబ్జా చేశారని ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, ప్రభాకర్, రజనీకాంత్, భీమేశ్, సుభాశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### నోట్‌బుక్‌ల పంపిణీ


నోట్‌బుక్‌లతో విద్యార్థులు

**తానూరు:** మండలంలోని ఎల్వి ప్రాథమిక పాఠశాలలో చదివే 70 మంది విద్యార్థులకు రూ.10వేల విలువైన నోట్‌బుక్‌లు, విద్యాసామగ్రి ఉపాధ్యాయులు అందించడం అభినందనీయమని ఎంఈవో నరేందర్ అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు హరీశ్, శివ, అఖిల్ పాఠశాల కమిటీ , గ్రామ కమిటీ సభ్యులు, పోషకులు పాల్గొన్నారు.

### బురద రోడ్లకు మరమ్మతులు


మొరం చదును చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్

సాక్షి ఎఫెక్ట్..

**కడెం:** మండలంలోని మిద్దెచింత, ఇస్లాంపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 7న 'సాక్షి'లో బురద రోడ్లపై వెళ్లేదెలా శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేలా మొరం పోసి పైపులు వేయించి ట్రాక్టర్లతో చదును చేయించారు.

### మరమ్మతు కోసం ధర్నా

**కుభీర్:** మండలకేంద్రంలో వివేకానంద చౌరస్తా వరకు బీటీ రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో మంగళవారం రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని బీజేపీ నాయకులు, వాహనదారులు రోడ్డుపై ధర్నా చేశారు. పోలీసులు వచ్చి ధర్నాను విరమింపజేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులు టిప్పర్ వైట్‌మిక్స్ తెప్పించి గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.విఠల్, వసంత్, కనకయ్య తదితరులు ఉన్నారు.

### గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణ

**ఖానాపూర్:** మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల విషయమై కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జెడ్పీ సీఈవో గోవింద్ పాతఎల్లాపూర్ పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదుదారులతో మాట్లాడారు. విచారణ నివేదిక కలెక్టర్‌కు అందించనున్నట్లు పేర్కొన్నారు. హౌజింగ్ పీడీ కె.రాజేశ్వర్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవో సునీత, హౌజింగ్ ఏఈ ఖయ్యూం ఉన్నారు.

### విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

**నిర్మల్‌చైన్‌గేట్:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏవో సూర్యారావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు సాన్న భూమేశ్, కల్లూరు సుధాకర్, రాజు, మహరాజ్, సీహెచ్ శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

### గోశాల ప్రారంభం

**ఖానాపూర్:** మూగజీవాలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఓం శ్రీ కాళీమాత గోశాల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని కేంద్రం నిర్వాహకురాలు పద్మ అమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్ శివారు తర్లపాడ్ వద్ద గోశాలను ప్రారంభించారు. పాలవేణి భీమనర్సయ్య, రాజేందర్, సాయిప్రీతమ్, ఓంకార్, సాయితేజ, సతీశ్, ఉన్నారు.

## విద్యార్థులను ఇంటివద్ద చదివించాలి

**మామడ:** మండలంలోని అన్ని పాఠశాలలలో మంగళవారం పోషకుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఉపాధ్యాయులు పోషకులకు వివరించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

**లక్ష్మణచాంద:** మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన పోషకుల సమావేశం నిర్వహించారు. లక్ష్మణచాందలో నిర్వహించిన పోషకుల సమావేశంలో హెచ్‌ఎం రాజునాయక్ మాట్లాడారు. విద్యార్థులు ఇళ్లకు రాగానే ఆరోజు చెప్పిన పాఠాలను వారితో చదివించాలని పోషకులకు సూచించారు. ప్రతి ఇంటిలో చదువుకునే రూము ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంట చదువుల పంట యాప్‌ను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.


లక్ష్మణచాంద : మాట్లాడుతున్న హెచ్‌ఎం రాజు

**లోకేశ్వరం:** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని మండలంలోని రాజూర గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజూర గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కలీం, రోహిత్, ప్రవీణ్, సరస్వతి ఉన్నారు.

## బాధ్యతగా మొక్కలు నాటాలి

**తానూరు:** పర్యావరణ పరిరక్షణకు తమ వంతు మొక్కలు నాటి పరిరక్షించాలని ఎంపీడీవో నసీరొద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని కోలూరులో వనమహోత్సవం నిర్వహించగా గ్రామస్తులతో కలిసి మొక్కలు నా టారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి పంపిణీ చేసే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీఏలు గంగాధర్, కార్యదర్శి తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి , సిబ్బంది పాల్గొన్నారు.

**ఖానాపూర్:** వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపక బృందం, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్ రెడ్డి తదితరులు ఉన్నారు.


ఖానాపూర్‌లో మొక్క నాటుతున్న అధ్యాపకులు

## సంక్షిప్త వార్తలు

**వ్యాధులు ప్రబలకుండా చూడాలి**

**కుంటాల:** గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మంగళవారం డ్రై డే సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని పారబోయించారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, సిబ్బంది ఉన్నారు.

**గ్రామాల్లో డ్రైడే**

**లక్ష్మణచాంద:** మండలంలోని పలు గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. వైద్య, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఇళ్లకు వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పొట్టపెల్లిలో ఆయిల్ బాల్స్ వేశారు. కార్యదర్శి ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

**మహిళలు అభివృద్ధి సాధించాలి**

**నర్సాపూర్(జి):** మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని డీపీఎంలు విజయలక్ష్మి , మారుతి అన్నారు. మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఉత్తమ మహిళా సంఘ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం సునంద, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

**సన్మానం**

**లోకేశ్వరం:** మండలంలోని రాజూర గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ లలిత ఇటీవల పదవి విరమణ పొందారు. మంగళవారం ఆమెను గ్రామస్తులు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సన్మానించారు. అంగన్‌వాడీ టీచర్‌గా 34 ఏళ్లు సేవలందించినట్లు గుర్తు చేశారు. మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు పద్మజవాణి తదితరులు ఉన్నారు.

**విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ**

**ఖానాపూర్:** మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కొలాంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం తిరుమలేష్ మిత్రుడు పి.రాకేశ్ కూతురు వినోజ్ఞ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు.

**దివ్యాంగులకు ఫిజియోథెరపీ**

**తానూరు:** మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 22 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల హాజరు పెంచాలి**

**లోకేశ్వరం:** పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని రాయాపూర్‌కాండ్లీ ప్రాథమికోన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను విద్యార్థులకు అందించాలని సూచించారు. పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి జె.రాజారాం, హెచ్‌ఎం దేవిదాస్ ఉన్నారు.

**డ్రగ్స్‌కు దూరం ఉండాలి**

**కడెం:** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఎస్సై పి.సాయికిరణ్ అన్నారు. మంగళవారం కడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డ్రగ్స్ అనర్థాలను వివరించే పోస్టర్‌ను ఆవిష్కరించి విడుదల చేశారు. అనంతరం కళాశాల డ్రగ్స్ కమిటీ అధ్యక్షుడిగా ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, స్టూడెంట్ కౌన్సిలర్లుగా ప్రసాద్ కుమార్, సరిత నియమితులయ్యారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజన్న, స్వామి, శరణ్య, రజిత, నరేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తా

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

**దిలావర్‌పూర్:** నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాయాపూర్ గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, వి.సత్యనారాయణగౌడ్, మాజీ జెడ్పీటీసీ రమణారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు నర్సారెడ్డి, సత్యం చంద్రకాంత్, జంగం వీరేశ్‌కుమార్, పోల పద్మవిక్రమ్, మధుకర్, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**సోన్:** మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం మండలంలోని 62 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, ముగ్గురికి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. సరికెల గంగన్న, బీజేపీ మండలాధ్యక్షుడు మార గంగారెడ్డి, నాయకులు హరీశ్‌రెడ్డి, జక్క రాజేశ్వర్, అమృత్, నరేశ్, నాయకులు పాల్గొన్నారు.


సోన్‌లో కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**లక్ష్మణచాంద:** మండలకేంద్రంలోని రైతువేదికలో మండలంలోని 117 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్ పంపిణీ చేశారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షులు చిన్నయ్య, రమేశ్, ముత్యంరెడ్డి, జీవన్‌రెడ్డి, రవి ఉన్నారు.

**మామడ:** మండలకేంద్రంలోని రైతువేదికలో మండలంలోని 47 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆరెపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మించిన పశువైద్యశాల భవనం ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, బీజేపీ నాయకులు బాపురెడ్డి, రాజారెడ్డి, రంజిత్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, లింగారెడ్డి, చిన్నారెడ్డి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీలో చేరిక**

**సారంగపూర్:** మండలంలోని జామ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నలిమెల రాము బీజేపీలో చేరాడు. బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజేందర్‌రెడ్డి, చంద్రకాంత్, నర్సయ్య, విలాస్, తిరుమలచారి, రమణ తదితరులు ఉన్నారు.

### మండల మహిళాశక్తి సదస్సు

**నిర్మల్‌రూరల్:** జిల్లాకేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో మంగళవారం నిర్మల్ మండల మహిళా శక్తి సదస్సు నిర్వహించారు. దీనికి అదనపు డీఆర్డీవో చరణ్‌దాస్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులను కోటీశ్వరులను చేయడం, 15 నుంచి 18 ఏళ్లలోపున్న బాలికలను సంఘాల్లో చేర్పించడం వంటి అంశాలు వివరించారు. మహిళలకు బీమా, వడ్డీ లేని రుణాల గురించి వివరించారు. ఇప్పటికే మండలానికి రూ.కోటి రూపాయల వడ్డీ వెనక్కి వచ్చిందన్నారు. రుణాల రికవరీలో ప్రతిభ కనబరిచిన వీవోలను సన్మానించారు. ఇందులో అధికారులు గంగన్న, మారుతి, హేమలత, ఏపీఎం బోసు, సీసీలు సంతోష్, నరసయ్య, భోజన్న, జ్యోతిర్మయి, మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న, లక్ష్మి, రబియా పాల్గొన్నారు.

## 'ఉపాధి' పనులు పకడ్బందీగా చేపట్టాలి

**నిర్మల్‌రూరల్:** అవకతవకలకు పాల్పడకుండా ఉపాధిహామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీవో నాగవర్ధన్ సూచించారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో నిర్మల్‌రూరల్ మండల ఉపాధిహామీ 15వ విడత ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పేర్కొన్నారు. మండలంలోని 20 గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను పరిశీలించి రూ.9,991 రికవరీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇంకుడుగుంతలు, హార్టికల్చర్ ఫామింగ్, పాంపాండ్ నిర్మించాలని సూచించారు. ఎంపీడీవో గజానన్, ఈజీఎస్ రాష్ట్ర పరిశీలకులు దత్తు, హెచ్‌ఆర్ సుధాకర్, ఎస్ పి ఎం మహేష్ ,ఏపీవో తులరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు మెట్టు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్డీవో నాగవర్ధన్

### గోరింటాకు సంబరాలు


గోరింటాకుతో చిన్నారులు

**ఖానాపూర్:** పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో విద్యార్థినులు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వార్డెన్ స్వప్న మాట్లాడుతూ ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం ద్వారా రోగాలు దరి చేరకుండా ఉంటాయని పేర్కొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**కడెం:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కడెంతోపాటు, మాసాయిపేటలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

**కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి..**

హరిత రిసార్ట్స్‌లో మండలంలోని కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ భూషణ్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, పీఆర్ ఏఈఈ సూర్యకుమార్, మండలాధ్యక్షుడు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, రమేశ్, శంకర్, గంగన్న తదితరులున్నారు.


కడెంలో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

### సాయినామ పారాయణం ప్రారంభం

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో ఈనెల 10న గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా 48 గంటలపాటు నిరాటంకంగా కొనసాగే అఖండ సాయి నామ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం ప్రారంభించారు. నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సామ భీమ్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దత్తసాయి ఆలయ కమిటీ చైర్మన్ బురాజ్, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, సభ్యులు ఉప్పుల నందు, నారాయణరెడ్డి, జిందం గోవర్ధన్, మహేందర్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న భక్తులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899